# కారు..చేరికల జోరు

## మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు


మేడ్చల్‌లో మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న యువకులు

మేడ్చల్, అక్టోబర్ 27 : మేడ్చల్ నియోజకవర్గంలో ప్రచారంలో కారు దూసుకెళ్తున్నది. రోజు రోజుకు వేగం పెంచుతూ ప్రతిపక్ష పార్టీలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఒకవైపు ప్రచారం..మరో వైపు చేరికలతో హోరెత్తిస్తోంది. శుక్రవారం మేడ్చల్ పట్టణం, శామీర్‌పేట మండలం లాల్‌గడీమలక్‌పేట, నాగారం మున్సిపాలిటీలో మంత్రి మల్లారెడ్డి సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన 300 మంది నాయకులు, కార్యకర్తలు, మహిళా నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. మేడ్చల్ పట్టణంలోని 17,18వ వార్డులకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ నేత రామన్నగారి రాఘవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో చేరికల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మహిళలతో కలిసి నేలపై కూర్చొని, జై బీఆర్ఎస్, జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. ఆప్యాయంగా పలకరిస్తూ బీఆర్ఎస్‌ను గెలిపించాలని, పార్టీలోకి చేరిన వారికి స్వాగతం పలికారు. ఓ వృద్ధురాలిని తన ఒడిలో కూర్చొపెట్టుకొని, విజయ సంకేతాన్ని చూపారు. అనంతరం చైర్‌పర్సన్ మర్రి దీపికానర్సింహా రెడ్డి, రాఘవేందర్ గౌడ్‌తో కలిసి బీఆర్ఎస్‌లో చేరిన మహిళలు, యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే లాల్‌గడీమలక్‌పేటలో సర్పంచ్ వనజాశ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బీఎస్పీ నుంచి 15 మంది, నాగారం మున్సిపాలిటీలో పార్టీ అధ్యక్షుడు శ్రీధర్, చైర్మన్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు.

## తొమ్మిదేండ్లలో అద్భుతమైన అభివృద్ధి

### డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్


మాణికేశ్వరినగర్ బస్తీలో ప్రచారంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ తదితరులు

సికింద్రాబాద్, అక్టోబర్ 27 : బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేండ్లలో కనివినీ ఎరుగని విధంగా అభివృద్ధి చేసిందని డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. శుక్రవారం తార్నాక డివిజన్ పరిధిలోని మాణికేశ్వరినగర్ బస్తీలో ఎన్నికల ప్రచార పాదయాత్ర చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను ఆప్యాయంగా పలుకరిస్తూ ప్రచారంలో ముందుకు సాగారు. బస్తీ నగర డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, పద్మారావు తనయులు కిశోర్‌గౌడ్, కిరణ్‌గౌడ్, రామేశ్వర్‌గౌడ్, త్రినేత్ర గౌడ్‌లతో పాటు సికింద్రాబాద్ కార్పొరేటర్లు హేమ, సునీత, శైలజ, ప్రసన్నలక్ష్మి గడప గడపకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ.. సికింద్రాబాద్ నియోజకవర్గంలో గత 50 ఏండ్లుగా జరగని అభివృద్ధి కేవలం 9 ఏండ్లలోనే చేశామన్నారు. మాణికేశ్వరి నగర్‌లో హాస్పిటల్ నిర్మాణం తమతోనే సాధ్యమన్నారు. చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి మరోసారి తనను గెలిపించాలని ప్రజలను కోరారు. తాము ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చామని చెప్పారు. హామీ ఇవ్వని వాటిని బీఆర్ఎస్ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు.

## భారీ మెజార్టీతో గెలిపించండి

### మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి


మచ్చ బొల్లారం డివిజన్ మార్కెట్‌లో ఓటు వేయాలని కోరుతున్న అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, అక్టోబర్ 27: ప్రజలు కారు గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మచ్చ బొల్లారం, మల్కాజిగిరి, మౌలాలి, అల్వాల్, నేరేడ్‌మెట్ డివిజన్‌లలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల తర్వాత 50 పడకల దవాఖానను 100 పడకలుగా విస్తరిస్తామన్నారు. ప్రజల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు నెలనెలా పింఛన్లు అందజేస్తున్నామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిడర్‌పై ఆర్థిక భారం మోపిందని, ఎన్నికల తర్వాత రూ.400కు అర్హులైన వారికి సిలిండర్ అందజేస్తామన్నారు. నియోజకవర్గాన్ని ప్రజలు గర్వపడేలా అభివృద్ధి చేస్తానన్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతిశ్రీనివాస్ రెడ్డి, సబితాకిశోర్, మీనాఉపేందర్ రెడ్డి, సునీతారాము యాదవ్, అనిల్‌కిశోర్, డోలీ రమేశ్, అమీనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ తీరు దుర్మార్గం

### రైతుబంధు పథకంతో దుబారా చేస్తున్నారంటూ ఉత్తమ్ వ్యాఖ్యలు

- రైతులకు ద్రోహం చేయడం సిగ్గుచేటు
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



బంజారాహిల్స్,అక్టోబర్ 27: రైతుబంధు పథకంతో పాటు పేదల కోసం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీని తెలంగాణ ప్రజలు ఈసడించుకుంటున్నారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. రైతుబంధును ఆపాలంటూ కాంగ్రెస్ నేతలు మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎన్నికల సంఘానికి లేఖలు రాయడంతో పాటు రైతుబంధు పేరిట డబ్బులు దుబారా చేస్తున్నారంటూ కాంగ్రెస్ సీనియర్ నేత ఉత్తమ్‌కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే దానం నాగేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే నాగేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రైతులు పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి నుంచి బయటపడేయడంతో పాటు వారికి అండగా నిలబడటం కోసం సీఎం కేసీఆర్ రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల మరమ్మతులు చేసి సాగుకు నీరందించడంతో ఇప్పుడిప్పుడే రైతులు అద్భుతాలు సృష్టిస్తున్నారన్నారు. గతంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రైతులకు 3గంటలు ఉచిత విద్యుత్ సరిపోతుందని వ్యాఖ్యానించాడని గుర్తు చేశారు. కర్నాటక రాష్ట్రంలో రైతులను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని రైతులకు వ్యతిరేకంగా పనిచేస్తున్న కాంగ్రెస్‌ను భూస్థాపితం చేయడం ఖాయమన్నారు. దళితబంధు, బీసీ బంధు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పంపిణీ, గృహలక్ష్మి తదితర పథకాలన్నింటినీ ఎన్నికల పేరుతో కాంగ్రెస్ పార్టీ నేతలు అడ్డుకుంటున్నారని తెలిపారు. పేదల ఆగ్రహానికి కాంగ్రెస్ బూడిద కావడం ఖాయమని, రానున్న ఎన్నికలు రేవంత్‌రెడ్డికి చివరి ఎన్నికలు అవుతాయన్నారు.

## రైతు విరోధి కాంగ్రెస్..

మియాపూర్ , అక్టోబర్ 27 : ఏండ్ల తరబడి పాలించిన కాంగ్రెస్‌కు రైతుల గోస ఏనాడూ పట్టలేదని విప్ అరెకపూడి గాంధీ అన్నారు. సాగు నిమిత్తం రైతన్నకు రైతుబంధు పథకం ద్వారా సాయం అందిస్తున్న నిజమైన రైతు బాంధవుడిగా కేసీఆర్ నిలిస్తే....ఆ పథకమే అనవసరమంటూ కాంగ్రెస్ నేతలు రాబంధుల్లా తయారయ్యారన్నారు. శుక్రవారం విప్ అరెకపూడి గాంధీ మాట్లాడుతూ... రైతుబంధు పథకం పై కాంగ్రెస్ నేత ఉత్తమ్‌కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తొలి నుంచి కాంగ్రెస్‌కు రైతులంటే గిట్టదని..అందుకే రైతులకు పూర్తిగా అండగా నిలుస్తున్న రైతుబంధు పథకం దుబారా ఖర్చని, పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి నిరంతరం ఉచిత విద్యుత్‌ను అందిస్తూ సాగును పండుగ చేసిందన్నారు. రైతు విరోధిగా నిరూపించుకున్న ఇలాంటి పార్టీకి ఎన్నికల్లో తగిన గుణపాఠం ప్రజలు తప్పక చెబుతారన్నారు. కపట కాంగ్రెస్‌కు ఎన్నికల్లో కరెంట్ షాక్ తప్పదని విప్ గాంధీ స్పష్టం చేశారు.

# మైనార్టీల సంక్షేమానికి కృషి


బీఆర్ఎస్ పార్టీలో చేరిన నాయకులకు కుండువా కప్పుతున్న హోం మంత్రి మహమూద్ అలీ, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి తదితరులు

### రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ

చర్లపల్లి, అక్టోబర్ 27 : ముస్లిం మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తాలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ఆధ్వర్యంలో వివిధ పార్టీల నుంచి 100 మంది ముస్లిం మైనార్టీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి తాడూరి శ్రీనివాస్‌తో కలిసి హోంమంత్రి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముస్లింలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఖాళీ అయిందని, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి తాడూరి శ్రీనివాస్, ఉప్పల్ నియోజకవర్గం బీఆర్ఎస్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు మహ్మద్ బద్రుద్దీన్ ప్రసంగించారు. పార్టీలో చేరిన వారిలో నాయకులు సయ్యద్ యాసీన్, సయ్యద్ మోయిజ్, మహ్మద్ మోహిజ్, నజీం, యూనిస్, రహీం, అసీఫ్, సోహల్, అక్రం, వసీం, బబ్లూ, సమీర్, జిషాంత్, మన్నన్, సమీర్‌లతో పాటు నాయకులు, యువకులు చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేశ్‌గౌడ్, బాల్‌రెడ్డి, ఎస్కే.కరీం, రాజేశ్వర్‌రెడ్డి, హరినాథ్, ప్రభాకర్ రెడ్డి, ప్రభుగౌడ్, రమేశ్, రాజుగౌడ్, యాదగిరి, సురేశ్, ధనుంజయ గౌడ్, వినయ్‌సాగర్, భానుచందర్, మహ్మద్ నయీం, లోక్‌నాథ్, పుష్పలత, ఉమ, సత్తెమ్మ పాల్గొన్నారు.

# అభివృద్ధి చేశా..మరోసారి దీవించండి

### ప్రచారంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్


కూరగాయల వ్యాపారి మద్దతు కోరుతున్న కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, అక్టోబర్ 27 : గడిచిన నాలుగున్నరేండ్లలో అంబర్‌పేట నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేశానని.. మరోసారి దీవించాలని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ప్రజలను కోరారు. శుక్రవారం నల్లకుంట డివిజన్‌లోని శ్రీవెంకటేశ్వర నగర్, అంబేద్కర్‌నగర్, వినాయకనగర్, హనుమాన్‌నగర్, కార్ఖానా గల్లీ తదితర ప్రాంతాల్లో డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, మాజీ టాంకామ్ చైర్మన్ రంగారెడ్డి, సీనియర్ నాయకుడు పాకచందర్ తదితరులతో కలిసి ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ బస్తీలోకి వెళ్లిన మహిళలు ఎదురొచ్చి ఎమ్మెల్యేకు హారతులు పట్టారు. అనంతరం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి చెందిందని, పేద బలహీన వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేశారని తెలిపారు. గతంలో కంటే ఎంతో మెరుగైన రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సదుపాయాల కల్పన జరిగిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ మాట తప్పదని.. ప్రస్తుత పథకాలు కొనసాగిస్తూనే ఎన్నికల తర్వాత పెంచి అందించబోయే పింఛను, సన్నబియ్యం, అర్హులైన మహిళలకు రూ.400లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు.